క్లుప్తంగా

సందీప్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ కృతికా శుక్లాను కలసిన ఈఈ సందీప్‌రెడ్డి

కాకినాడ సిటీ: జిల్లా పొల్యూషన్ కంట్రోల్ ఈఈగా నియమితులైన బి.సందీప్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన విజయవాడ హెడ్ ఆఫీస్‌లో ఏఈఈగా పని చేసి పదోన్నతిపై జిల్లాకు వచ్చారు.

కలెక్టర్‌ను కలిసిన సామర్లకోట మున్సిపల్ కమిషనర్

కాకినాడ సిటీ: సామర్లకోట మున్సిపల్ కమిషనర్‌గా నియమితులైన జె.రామారావు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరు మున్సిపల్ కమిషనరేట్‌లో సెక్రటరీగా పని చేసిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా సామర్లకోట మున్సిపల్ కమిషనర్‌గా వచ్చారు.

ముగిసిన వేసవి శిక్షణ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న హెచ్‌ఎం ప్రేమ్‌జ్యోతి

కాకినాడ కల్చరల్: స్థానిక మున్సిపల్ చిల్డ్రన్ పార్క్ ఆవరణలోని బాలభవన్‌లో వేసవి ప్రత్యేక శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిసాయి. ముఖ్య అతిథిగా పీఆర్ ప్రభుత్వ బాలుర పాఠశాల హెచ్‌ఎం ప్రేమ్‌జ్యోతి హాజరై సంగీతం ప్రాముఖ్యతను వివరించి, సమాజిక స్పృహతో లలిత కళల ఆవశ్యకతను గుర్తించి ప్రావీణ్యం సాధించాలన్నారు. అనంతరం శిక్షణ తరగతిలో నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. అలాగే ఇటీవల విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో విజేతలుగా నిలచిన బాలభవన్ విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. బాలభవన్ ఉపాధ్యాయ సిబ్బంది, పర్యవేక్షకురాలు ఎ.శారద వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

12 నుంచి జాతీయస్థాయి నాటికల పోటీలు

కాకినాడ కల్చరల్: కాకినాడ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు జాతీయస్థాయి నాటికల పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం సినిమా రోడ్డులో ఈ మేరకు పోటీల బ్రోచర్లను ఆవిష్కరించారు. అసోసియేషన్ నాయకులు కె.కృష్ణారావు, నాదెళ్ల ప్రభుదాస్, నాగిరెడ్డి సతీష్‌రావు, కొప్రపాటి సౌజన్యరావు మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు యంగ్‌మెన్స్ హ్యాపీక్లబ్ దంటు కళాక్షేత్రంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు.

రూ.10 లక్షల బీమా అందజేత



సునీల్‌కుమార్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న బీఎం విజయలక్ష్మి

కరప: వేలంగి పెద్ద హరిజన పేటకు చెందిన యర్ర వెంకటరమణ, అరుణ్ కుమారి దంపతుల 18 ఏళ్ళ కుమారుడు యర్ర సునీల్ కుమార్ గత ఏడాది జూలై 27న వాకాడ వద్ద ప్రమాదవశాత్తు మరణించాడు. వారి కుటుంబ సభ్యులకు సంవత్సరానికి 500 చొప్పున ప్రమాద బీమా పథకంలో ఉన్నారు. ఈ మేరకు రూ.పది లక్షలను సునీల్‌కుమార్ కుటుంబ సభ్యులకు స్టేట్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ వి.విజయలక్ష్మి, అకౌంటెంట్ పి.మధుసూదన్, క్యాషియర్ కె.జోగారావు అందజేశారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



ప్రదర్శనలో వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

బోట్‌క్లబ్: స్థానిక నాగమల్లితోట జంక్షన్ వద్ద ఉన్న ద్వారంపూడి భాస్కర్‌రెడ్డి, పద్మావతి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ నగర మహిళలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, సీతాకాంత్ మాట్లాడుతూ గృహిణులు, మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశ నలుమూలలు నుంచి ప్రఖ్యాతిగాంచిన సుమారు 50 పైగా డిజనర్లు రూపొందించిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కత్తా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నగరాల నుంచి ప్రముఖ డిజైనర్లు తీసుకొచ్చి నగర ప్రజలకు లేటెస్ట్ డిజైనర్ వస్త్రాలు పరిచయడం చేసినట్లు తెలిపారు. ఆదివారం రాత్రి 9 గంటలు వరకూ ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇంతింటి ఆనందం

నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో దాదాపు 30 వేల మంది కాకినాడ సిటీ నియోజకవర్గ లబ్ధిదారుల సొంతింటికల సాకారం కాబోతుంది. అర్బన్ ప్రాంతంలో గజం స్థలం కూడా అందుబాటులో లేని పరిస్థితుల్లో దగ్గరలోని దాదాపు 650 ఎకరాల ప్రైవేటు భూములను కొనుగోలు చేసి మరీ లే అవుట్లుగా చేసి రూ.750 కోట్లు వెచ్చించి లబ్ధిదారుల కోసం సిద్ధం చేశారు. వీళ్లంతా రేపో మాపో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని ఇంటి యజమానులు కాబోతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చొరవ తమను ఓ ఇంటివారిని చేయబోతోందని లబ్ధిదారులు సంబరపడుతున్నారు.

- ఆడపడుచులకు జగనన్న కట్నంగా ఇళ్ల స్థలాల పంపిణీ
- సొంతింటికల సాకారమవుతున్న వేళ గృహనిర్మాణ లబ్ధిదారుల్లో ఆనంద హేల

కాకినాడ: పట్టణ ప్రాంతంలో స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టించి ఇస్తామన్న హామీ సాహసోపేతమైన నిర్ణయమే. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన భరోసాతో ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి కాకినాడలోని పేదలందరికీ 10 వేల ఇళ్లు కట్టించి ఇస్తానంటూ హామీ ఇచ్చారు. ఎన్నికలయ్యాక వాస్తవంలోకి వెళ్తే అర్హులైన లబ్ధిదారుల సంఖ్య 30వేలకు చేరింది. అయినప్పటికీ ప్రభుత్వం ఏ మాత్రం వెనుకడుగు వేయకుండా అందరికీ పట్టాలు ఇచ్చేందుకు సిద్ధపడింది.

అవరోధాలు అధిగమించి...

ముప్పైవేల మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చే క్రమంలో ప్రతిపక్ష టీడీపీ ఆదిలోనే మోకాలు అడ్డింది. 115 ఎకరాల దుమ్ములపేట స్థలాన్ని ప్రజలకు ఇచ్చేందుకు సిద్ధం చేస్తుండగా అది మడ అడవి అంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్థలాల పంపిణీకి అడ్డుపడింది. దీంతో ఎమ్మెల్యే ద్వారంపూడి ఈ అంశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో కొమరగిరి, ఏపీ త్రయం, చొల్లంగి, పటవల, జి.వేమవరం ప్రాంతాల్లో దాదాపు 650 ఎకరాల ప్రత్యామ్నాయంగా ప్రైవేటు స్థలాలను కొనుగోలు చేసి పేదలకు సిద్ధం చేసి అవరోధాలను అధిగమించి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు.

రూ.750 కోట్లతో అభివృద్ధి...

దాదాపు 650 ఎకరాలను భూసేకరణ ద్వారా కొనుగోలు చేయడంతో పాటు ఆ స్థలాలను ప్రైవేటు లే అవుట్లకు ధీటుగా సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ఇందు కోసం రూ.750 కోట్లకు పైగా ఇప్పటికే వెచ్చించారు.

కుటీర పరిశ్రమలు ఏర్పాటు..

కేవలం స్థలం ఇచ్చి ఇళ్లు కట్టివ్వడమే కాకుండా స్థానికంగా నివసించే ప్రజలకు ఉపాధి అవకాశాలపై కూడా ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఈ క్రమంలో చొల్లంగి వంటి లే అవుట్ల వద్ద కుటీర పరిశ్రమలను కూడా ఏర్పాటు చేసేందుకు సంకల్పించారు. ఆ మేరకు చెన్నై సిల్క్స్ వంటి పెద్దపెద్ద సంస్థలతో ఇప్పటికే సంప్రదింపులు చేస్తున్నారు.

కాకినాడ సిటీ నియోజకవర్గం	
లబ్ధిదారుల సంఖ్య	: 30వేలు
సేకరించిన స్థలం	: 650 ఎకరాలు
వెచ్చించిన మొత్తం	: రూ.750 కోట్లు
స్థలాలు ఇచ్చే గ్రామాలు	: ఆరు
మొత్తం లే అవుట్ల సంఖ్య	: 10





చొల్లంగి గ్రామంలో తమ ఇంటి స్థలాల వద్ద ఆనందడోలికల్లో లబ్ధిదారులు

లబ్ధిదారుల్లో ఆనందహేల

ఇదిగో నా ఇంటి జాగా.. ఇదే నాకు జగనన్న ఇచ్చిన స్థలం.. ఇక్కడే నేను ఇల్లు కట్టుకోబోతున్నా.. ఇవీ నవరత్నాలు– పేదలందరికీ ఇల్లు పథకంలో స్థలాలు దక్కించుకున్న లబ్ధిదారుల మనసులోని మాట. పట్టాలు చేతికందగానే అక్కచెల్లెమ్మలు ఆ పట్టాను చూసి ఎంతో మురిసిపోయారు. ఏదో ఓ స్థలం ఇచ్చి చేతులు దులుపుకోకుండా మౌలిక వసతులు కల్పించి ప్రైవేటు లే అవుట్లను తలపించేలా ఉన్న స్థలాలు తమ జీవితానికో భరోసా ఇచ్చిందంటూ ఆనంద డోలికల్లో తేలియాడుతున్నారు. పట్టణ ప్రాంతంలో వేలాది రూపాయల ఇంటి అద్దెలు చెల్లించుకోలేని తమకు సీఎం సమకూర్చబోతున్న సొంత ఇల్లు భరోసా ఇస్తోందంటూ ఆనందంతో పదిమందికి చెప్పుకుంటున్నారు.

పదేళ్లుగా ఎదురుచూపు...



ఇంటి స్థలం కోసం పదేళ్ల పాటు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగా. ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. భర్త చనిపోవడంతో ఏ ఆసరా లేని నాకు ఇక జీవితంలో స్థలం, సొంత ఇల్లు కట్టుకోవడం జరగదనుకున్నాను. నెలకు 4 వేలు అద్దె కడుతూ ఇద్దరు ఆడ పిల్లలను పోషించుకుంటూ జీవితాన్ని నెట్టుకొస్తున్నాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ ద్వారా పిలిచి మరీ స్థలం ఇవ్వడంతో ఇనేళ్ల నా కల నెరవేరుతోంది. త్వరలోనే నాకంటూ ఓ గూడు అమరుతోంది. చాలా ఆనందంగా ఉంది.

చోడిపల్లి రత్నం, 18వ డివిజన్, జె.రామారావుపేట, కాకినాడ

అన్న ఇచ్చిన బహుమానం



తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడే ఇంటిస్థలం కోసం దరఖాస్తు పెట్టుకున్నాం. అప్పటి నుంచి ఎదురుచూస్తున్నాం. ఎంతో అభిమానించి, ఆదరించే జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక మా నిరీక్షణ ఫలించి చొల్లంగి వద్ద ఇంటి స్థలం సమకూరింది. త్వరలోనే ఇల్లు కూడా కట్టిస్తామని చెబుతున్నారు. ఓ అన్నగా జగనన్న మాకు ఇచ్చిన బహుమానం ఇది. ఎప్పటికీ ఆయనకు రుణపడి ఉంటాం.

నేరేడిమిల్లి జయలక్ష్మి, ముత్తానగర్, కాకినాడ

మౌలిక సదుపాయాల అభివృద్ధి



సిటీ నియోజకవర్గానికి చెందిన సుమారు 30వేల మంది లబ్ధిదారులకు పది లే అవుట్లలో ఇళ్ల స్థలాలు సిద్ధం చేశాం. ఇప్పటికే కొమరగిరి, ఇతర లే అవుట్లలో దాదాపు 6 వేల మంది ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. మిగిలిన లే అవుట్లలో కూడా ఇంటి నిర్మాణ ప్రక్రియ వేగవంతం అవుతోంది. ప్రభుత్వమే స్థలాన్ని ఉచితంగా ఇచ్చి మౌలిక వసతులు కల్పించడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం ద్వారా రూ.1.8 లక్షల వరకు ఇంటి నిర్మాణం కోసం సబ్సిడీ కోసం సమకూరుస్తోంది.

డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల, కమిషనర్, నగరపాలక సంస్థ

ఎమ్మెల్యే ద్వారంపూడికి ఎన్జీఓల సత్కారం



ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిని సత్కరిస్తున్న ఏపీ ఎన్జీవో నేతలు

- ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలపై హర్షం

కాకినాడ క్రైం: ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలపై ఏపీ ఎన్జీవో నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుద్దటి రామ్మోహన్‌రావు, పేపకాయల వెంకట కృష్ణ ఆధ్వర్యంలో నేతలు శుక్రవారం ఆయన కార్యాలయంలో కలసి సత్కరించారు. నేతలు మాట్లాడుతూ ఉద్యోగుల ప్రయోజనాల దృష్ట్యా 12వ పీఆర్‌సీ కమిటీ ఏర్పాటు, నూతన జిల్లాల ఉద్యోగులకు పాత జిల్లాలతో సమానంగా 16 శాతం పెంపుదలతో హెచ్‌ఆర్‌ఏ అమలు, ఐదేళ్లు పూర్తి చేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడం తదితర సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి నేరుగా ఎంఎల్‌ఏ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ద్వారా విన్నవించామన్నారు. సదరు సమస్యల పరిష్కారానికి ఆయన ఎంతో కృషి చేశారని, తమకు అన్ని వేళలా అండగా ఉన్నారని అన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి అని పేర్కొంటూ వారి సంక్షేమానికి కీలక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ద్వారంపూడిని సత్కరించిన వారిలో సంఘం మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, జిల్లా కోశాధికారి వై.పద్మమీనాక్షి, జిల్లా ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావు కార్యనిర్వాహక కార్యదర్శి ఎలియాజర్, కోశాధికారి శ్రీనివాసరావు, కాకినాడ నగర అధ్యక్ష, కార్యదర్శులు అజీజ్, సత్తిరాజు తదితరులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కరీం బాషా తదితరులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట మసీదు వద్ద ముస్లింలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. మసీదు వద్ద నమాజు అనంతరం నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు, వక్ఫ్‌బోర్డు కార్యదర్శి కరీం బాషా ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. ముస్లిం పెద్ద ఎస్‌కే అహ్మద్ మాట్లాడుతూ విజయవాడ నుంచి హజ్ యాత్రకు ఎంబార్కేషన్ సౌకర్యం ద్వారా విమానప్రయాణాన్ని కల్పించారని అన్నారు. కరీం బాష మాట్లాడుతూ రాష్ట్రం నుంచి 23 వేల మంది యాత్రకు బయలు దేరుతున్నారని, అందులో రోజుకు 170 మంది చొప్పున 13 రోజులు పాటు విమాన సర్వీసులు నేరుగా జిద్దాలో దిగే విధంగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి ఎటువంటి ఆర్థిక భారం పడకుండా ఒక్కొక్కరికీ రూ.83 వేలు చొప్పున 1810 మందికి రూ.14.51 కోట్లు కేటాయించిన సీఎంకు క్షీరాభిషేకం ద్వారా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. మసీద్ ప్రెసిడెంట్ ఎంఏ ఖాన్, సెక్రటరీ షేక్ సంధాని, ఎంఏ అలీమ్, ఎండీ కాజా, మొహిద్దీన్, ఎండీ అన్సారీ బేగ్, అయూబ్, ఎండీ ఖాజా, హుస్సేన్, ఎండీ షాబుద్దీన్ పాల్గొన్నారు.

బోట్‌క్లబ్‌లో గంగాధర విగ్రహం ఏర్పాటు



ఎమ్మెల్యే కురసాలకు షీల్డ్‌ను బహూకరిస్తున్న పెద్దిరెడ్డి సతీష్ తదితరులు

ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: ఆర్కెస్ట్రా పితామహుడు పెద్దిరెడ్డి గంగాధర విగ్రహాన్ని రమణయ్యపేట బోట్‌క్లబ్ ఉద్యానవనం వద్ద ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గంగాధర జయంతిని పురస్కరించుకుని ఆయన తనయుడు సతీష్, రావు ప్రసాద్, మల్లిపూడి రంగా తదితరులు ఎమ్మెల్యే కన్నబాబును ఆయన క్యాంపుకార్యాలయంలో శుక్రవారం కలసి విగ్రహ ఏర్పాటుపై చర్చించి షీల్డును అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి గంగాధరను గౌరవించడం మన ధర్మమని అన్నారు. కార్యక్రమంలో చిత్ర ప్రసాద్, నడిపూడి వీరభద్రరావు, కోమల సోనీ, సింగర్ వెంకట విజయ పాల్గొన్నారు.

11న మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష

కాకినాడ సిటీ: జిల్లాలోని రెండు మోడల్ స్కూళ్లు (ఆదర్శ పాఠశాల) శంఖవరం, హంసవరాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశం పొందేందుకు ప్రవేశపరీక్షకు కన్వర్జన్స్ సమావేశాన్ని జిల్లా అధికారులతో కలెక్టర్‌లో శుక్రవారం నిర్వహించారు. డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మోడల్ స్కూళ్లలో ఈనెల 11వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఆరో తరగతి ప్రవేశం పొందేందుకు పరీక్ష జరుగుతుందన్నారు. డీఈఓ కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, జిల్లా పోలీస్ అధికారి, మెడికల్ అండ్ హెల్త్, కాకినాడ ఆర్టీసీ, జిల్లా పబ్లిక్ రిలేషన్స్ అధికారి పాల్గొన్నారు.

12న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో 12వ తేదీ సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో అషిక్ టెక్నో సొల్యూషన్స్ కంపెనీలో డేటా ఎంట్రీ, వీడియో ట్రాఫిక్, సర్వే వీడియో కౌంట్, ఐడీఎఫ్‌సీ బ్యాంకులో సేల్స్ ఆఫీసర్, యాక్సిస్ బ్యాంకులో బీడీఇ, సేల్స్ ఆఫీసర్, అసిస్టెంట్ మేనేజర్స్, జియో ఫైబర్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, డిక్సాన్ కంపెనీలో టెక్నీషియన్, నిట్ (ఐసీఐసీఐ) బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ, సియాన్, ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పై ఉద్యోగాలకు ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.10 వేలు నుంచి రూ. 25 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 12వ తేదీ సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయానికి ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలతో హాజరుకావచ్చని పీడీ తెలిపారు.

'కార్తికేయ' డిపాజిట్‌దారుల ఆందోళన



కార్తికేయ సొసైటీ చైర్మన్ చాంబర్ వద్ద ఆందోళన చేస్తున్న డిపాజిట్‌దారులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): తమ డిపాజిట్‌లు వెంటనే చెల్లించాలని కార్తికేయ కో– ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ వద్ద డిపాజిట్ దారులు ఆందోళన చేపట్టారు. గడువు తీరినప్పటికీ ఏడాదిగా డబ్బులు చెల్లించకుండా ముఖం చాటేస్తున్న చైర్మన్ కేవీవీ సత్యనారాయణ శుక్రవారం సొసైటీ కార్యాలయానికి రావడంతో డిపాజిట్‌దారులు ఆందోళన చేసి చాంబర్‌ను ముట్టడించారు. బ్యాంకు నష్టాల్లో ఉండటంతో డిపాజిట్‌దారులకు నగదు ఇచ్చేందుకు సమయం పడుతుందని చైర్మన్ చెప్పడంతో ఒక సమయంలో ఆవేశంతో ఉన్న డిపాజిట్‌దారులు చైర్మన్‌పైకి దూసుకెళ్లారు. చైర్మన్ కూడా దురుసుగా సమాధానం చెప్పడంతో తోటి డిపాజిట్‌దారులు సర్దిచెప్పి చైర్మన్ చాంబర్ నుంచి బయటకు తీసుకు వచ్చారు. ఇప్పటికే సహకారశాఖ దీనిపై విచారణ చేపడుతోంది. సహకార చట్టం ప్రకారం చైర్మన్‌ను పదవి నుంచి తప్పించి, ఉన్న ఆస్తులు ఇప్పటికే అటాచ్ చేశారు. సత్యనారాయణ చైర్మన్ హోదాలో కొనసాగడం కుదరదని జిల్లా సహకారశాఖ అధికారి దుర్గాప్రసాద్ తెలిపారు. విచారణ అధికారులు మరో మూడు రోజుల్లో నివేదిక ఇస్తారని, దానిపై తదుపరి చర్యలు ఉంటాయని అన్నారు.

జాబ్ మేళాలో 63 మందికి ఉద్యోగాలు

కరప: జన రక్ష స్వచ్ఛంద సంస్థ, వికాస ఆధ్వర్యంలో కరప మండలం వేళంగి భాను ప్రకాష్ స్కూల్‌లో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. మొత్తం 13 కంపెనీలు పాల్గొన్న ఈ మేళాకు 132 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో మొత్తం 63 మంది ఎంపికై నట్టు ఆ సంస్థ వ్యవస్థాపకుడు వినయ్ కుమార్ తెలిపారు.

శెట్టిబలిజ విద్యార్థులకు ఉపకారవేతనాలు

బాలాజీచెరువు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చూపి 550కి పైగా మార్కులు సాధించిన శెట్టిబలిజ సామాజిక వర్గ విద్యార్థులకు ఉపకార వేతనాలు (మెరిట్ స్కాలర్‌షిప్) అందించనున్నట్టు శెట్టిబలిజ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, పదో తరగతిలో ప్రతిభచూపిన విద్యార్థులకు ఏటా తమ సంఘం తరుపున ఉపకార వేతనాలు అందిస్తున్నామన్నారు. తెలుపు రేషన్‌కార్డు కలిగిన వారు రాష్ట్రంలో ఎక్కడివారైనా ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 92478 64443 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

భగ్గుమంటున్న భానుడు



నిర్మానుష్యంగా రామారావుపేటలోని రహదారి

బోట్‌క్లబ్: నగరంలో ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచే సెగలు మొదలై మధ్యాహ్నానికి నిప్పుల కొలిమిలా నగరం మారిపోయింది. రికార్డు స్థాయిలో 43.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకావడంతో ప్రజలు తల్లడిల్లిపోయారు. వేడికి ఏసీల కంప్రెషర్లు సైతం పనిచేయక తీవ్ర ఉక్కపోతను అనుభవించారు. నిత్యం కిటకిటలాడే రద్దీ ప్రాంతాలు నిర్మానుష్యంగా కనిపించాయి.